# దివ్యౌషధం

శ్రీ మధురాంతకం రాజారాం

ఏమోయ్ కుర్రడాక్టరూ! నీ కోసమే చూస్తున్నా! ఇదిగో శ్రీదేవి! అబ్బాయి వచ్చాడుగానీ నాలుగు మల్‌గూబా మామిడిపళ్ళు పట్టుకురా."

"నా కొక్కటైతే చాలు! మిగిలిన మూడూ మీకా మేష్టరూ?" వినయం ఉట్టిపడుతుండగా ప్రశ్నించాడు డాక్టరు రమణమూర్తి.

"ఒక్కసారిగా మూడు మామిడిపళ్ళు తినడం చాలా ప్రమాదకరమని వైద్యశాస్త్రం చెబుతుందా ఏమిటి మూర్తీ?" మరింత అమాయికంగా ప్రశ్నించారు నారాయణరావుగారు.

"గురు శిష్యులమధ్య రగడ రాజుకుంటోందన్న మాట!" నవ్వుతూ హాల్లోకి వచ్చింది శ్రీదేవమ్మ.

"చూడు మిస్టర్ మూర్తీ! నువ్వు మీ పెద్దమ్మ మాటలకు పెద్ద గా పరిగణన ఇవ్వగూడదు. మాటి మాటికీ నా ఒజ్జరికాన్ని జ్ఞప్తికి తేవడం ఆమె కలవాటు. హైస్కూల్లో, అదీ యస్సెసెల్సీ క్లాసులో నీకు నాలుగు ఇంగ్లీషు ముక్కలు నేర్పానేమో, ఆ మేరకే మన గురు శిష్య సంబంధం! వైద్య శాస్త్ర విజ్ఞానం నువ్వు కళాశాలలో సంపాదించుకున్నది. ఆ శాస్త్రానికి సంబంధించినంతవరకూ నువ్వు డాక్టరువి. నేనొక మానవుణ్ణి. ఇక్కడ మానవుడనగా ఏ క్షణాన్నయినా డాక్టరుగారి ప్రాబల్యానికి లోనై అతడి నిగ్రహానుగ్రహాల్లో దేనికో ఒక దానికి గురి కావలసివున్న ఒకానొక సజీవ ప్రాణి అని నిర్వచనం! మామిడిపళ్ళేగాదు, నువ్వు మంచి నీళ్ళు త్రాగడం ఆరోగ్యకరం కాదని చెప్పు, మరుక్షణంనుంచీ నేను మంచి నీటిని ముట్టుకుంటే ఒట్టు......"

"నీకు పుణ్యముంటుందిగానీ దాహమైనప్పుడల్లా ఓ టంబ్లర్ పాయసం త్రాగమని చెప్పవయ్యా మూర్తీ! మీ మేష్టరుగారికి పాయసమంటే చాలా యిష్టం......" మళ్లీ కలుగజేసుకుంది శ్రీదేవమ్మ.

"ప్చ్, ప్చ్. నువ్వు లాభంలేదు శ్రీదేవీ ఇలా యింటి గుట్టు డాక్టర్లకు చెప్పుకోవచ్చా! రేపు నాకు ముక్కే నొప్పిందనుకో, ముఖమే వాచిందనుకో, డాక్టరేమంటాడు? 'నేను చెబుతున్నాను మేష్టారూ! మీరు తీపి వస్తువులు తినడం బాగా తగ్గించేయాలి' అనడూ! చేతులు గాలిన తర్వాత ఆకులు పట్టుకోడం బుద్ధిమంతుల లక్షణమేనా చెప్పు......"

పంతులుగారు శిష్యుణ్ణి ఎగతాళి పట్టించడం మామూలే! కానీ ఆవేళ పరిహాసం కాస్త శ్రుతి మీరిందేమో శిష్యుడి ముఖం చిన్నబోయింది. ప్రాక్టీసు క్రొత్తదే అయినా 'క్రొత్త వింత, పాత రోత' అన్న లోక సాంప్రదాయం రీత్యా నైతేనేమి, ఉత్సాహంతో, ఓర్పుతో శ్రద్ధగా కర్తవ్యాన్ని నిర్వహించడం వల్ల నైతేనేమి, డాక్టరు మూర్తికి చేతినిండుకూ పని తగులుతోంది. నిర్ణీత సమయాల్లో ఆసుపత్రిలో పనిచేసి, ఆసుపత్రికి రాలేని రోగులకోసం తెరిపి దొరికినప్పుడల్లా పట్టణాన్నొక చుట్టు వేసుకుని వచ్చి అనుదిన వ్యాసంగాల ఒత్తిడిలో అనురుసురై పోయిన తర్వాత మూర్తికి కాసేపు ఉల్లాసంగా కాలం గడపాలనిపిస్తుంది. అరగంటసేపు ఈ పురాణ దంపతుల సమక్షంలో కూర్చుని ఆ తరువాతవెళ్ళి పడుకుంటే హాయిగా నిద్ర గూడా వచ్చేస్తుంది. అలాగైతే తన ఉబలాటంకొద్దీ ఇలా రావడమే తన పొరబాటా! తరచుగా వస్తున్నాడుగదా అని తన నిలా లోకువచేసి పారేస్తారా మేష్టరుగారు!.....

పెడముఖం పెట్టుకుని గోడవైపు చూస్తూ కూర్చున్నాడు మూర్తి. అయిదు నిమిషాలవరకూ హాల్లో నిశ్శబ్దమే ఆవరించింది.

మళ్ళీ రావుగారే ప్రారంభించారు—"పరధ్యానంగా కూర్చున్నావేం శ్రీదేవీ! ముక్కలు కోసిపెట్టు. మన కిద్దరికీ చెరొక పండు. మూర్తికేమో రెండు. ఎందుకంటే భోజనానంతరం పళ్ళు తినడం మంచిది. ఆ మాట ఆరో తరగతి సైన్సు పాఠంలో ఉంది......"

విసురుగా అడ్డు తగిలాడు మూర్తి!— "వద్దులేండి పెద్దమ్మగారూ! కొంతసేపు కబుర్లు వినిపోవచ్చుననే నేనిలా రావడం......"

"అబ్బాయికి కోపం రావేవచ్చింది. రాకేంచేస్తుంది? ఏనాడో మీ దగ్గర చదువుకున్నాడన్న చొరవతో మీ రెంత మాటలంటే అంత మాటలనడం ఏం సబబు?" నిలదీసి ప్రశ్నించింది శ్రీదేవమ్మ.

"సబబుకాదని నీకే అనిపిస్తే నా కిక క్షమాపణ చెప్పుకోక తప్పుతుందా శ్రీదేవీ! శిష్యులకు గురువులు క్షమాపణ చెప్పుకోవలసి వస్తున్న సుదినాలే యివి! చెప్పండి. మీ రిద్దరూ కలిసి ఏ శిక్ష విధించినాసరే, శిరసావహించడానికి సిద్ధంగా ఉన్నాను......"

"అలా గన్నారు గనుక బాగుంది. అవునా మూర్తీ! శిక్షగా మరొకటీ మరొకటి ఎందుకూ! ఈ నాలుగుపళ్ళు ఆయన్నే తినేయమంటే సరిపోదూ!"

"ఎలాగైనా డాక్టరు మనవాడేనని నీ ధీమా! చూడు శ్రీదేవీ! ఎక్కడ బావ అన్నా వంగతోట దగ్గరమాత్రం బావ అనగూడదు......"

ఎంతగా పెదవులకు తాళం వేసుకుని కూర్చున్నా హఠాత్తుగా పెల్లుబికిన చిరునవ్వుల వరదకు ఆనకట్ట వేయలేకపోయాడు మూర్తి—"బాగుందిలేండి మేష్టరుగారూ! అప్పటికి నేను మీకు మందు లిచ్చీ యిచ్చి అలసి పోతున్నట్టు! ప్రాక్టీసు ప్రారంభించి దాదాపుగా ఏడాది కావస్తోంది నేను. ఇంత వరకు నా ఆసుపత్రి ముఖమైనా చూడనివాళ్ళు మీరొక్కరే!"

"మూర్తీ, మూర్తీ!" బతిమాలుతున్నట్టుగా అన్నారు రావుగారు. "ఎంత చెడినా నీకు నేను గురువునే అనుకున్నాను. ఆవిధంగా విన్నవా శ్రేయోభిలాషి క్రిందనే జమ కట్టాను..."

పొట్ట చెక్కలయ్యేటట్టుగా నవ్వసాగాడు మూర్తి. —"చూచారా పెద్దమ్మగారూ ! మేష్టరుగారి ధోరణీ యింత ! బెంచీ ఎక్కించడం, బెత్తంతో బాదడం లాంటి కఠిన శిక్షలు మాకు రివాజే ! కానీ అంతలోనే దగ్గరికి పిలిచి ఒక మాట అని నాలుగు నవ్వులు నవ్వించి 'వెళ్ళరా బాబూ' అని బుజ్జగించి పంపేసేవారు. అందువల్లనే మేష్టరుగారంటే భయమూ, భక్తీ గూడా ఉండేవి. . . ."

"ఆ భయ భక్తుల్ని భూతం తినిపోయిందిలేవోయ్ మూర్తీ ! భూతమంటే భూతకాలమని భావం ! ఇప్పుడా మాటెందుకు గానీ నువ్వు పళ్ళుతిను. . . ."

పళ్ళుతింటూ ఆలోచనలో పడ్డాడు మూర్తి—రోగాలు మనిషికి గాక మ్రానికొస్తాయా అన్నది లోకోక్తి. అనగా మనిషికీ రోగాలకు ఏదో గాఢమైన అనుబంధమే ఉందన్నమాట ! ఆహ్వానం పంపక పోవచ్చు. మనకు బొత్తిగా యిష్టమూ లేక పోవచ్చు. ఐనా మన అభిప్రాయంతో ప్రసక్తి పెట్టుకోకుండా తమంతట తామే శీఘ్రగా వచ్చి, ఇంట మకాంపెట్టి, తిన్నంత కాలం సుష్టుగా తిని, చిట్ట చివర బస్సు ఛార్జీలకు పైతం డబ్బు గుంజుకుని వెళ్ళే బంధువుల లాంటివి జబ్బులు. వాటి బారికి గురికాని మానవుడుండడు. తనకైతే సరిగ్గా తెలియదు గానీ మేష్టరుగారికైనా ఎప్పుడో ఒకప్పుడు జ్వరం, జలుబు, తలనొప్పి లాంటి మామూలు రకం జబ్బులైనా వచ్చి ఉండక పోవు.

"ఏమిటో ఆలోచిస్తున్నట్టున్నావు మూర్తీ !" నింపాదిగా అడిగాడు రావుగారు.

అలాగైతే మీరెప్పుడూ జబ్బు ముఖమే చూడలేదా మేష్టారూ ?— అన్న ప్రశ్న నాలుక చివరిదాకా వచ్చి అక్కడే ఆగిపోయింది. ఆ తొట్రుబాటులో తన ప్రశ్న కొకమారు వేషం తగిలించాడు మూర్తి—" "మరేం లేదండీ మేష్టారూ ? మనిషికి జ బ్బులెందు కొస్తాయీ అని ?"

"ఏమిటోనబ్బా ! నే నెన్నడూ ఆ అంశం పైన ఆలోచనలు పెట్టుకోలేదు. అలాంటి జిజ్ఞాసకు పూనుకోడానికి తీరికుండాలిగదా ! నాకు లేనిదే అది ! క్రమ శిక్షణ, సిలబస్సు, పరీక్షలు— ఈ బడిగోడల పరిమిత పరిధిలోనే ముప్పై యేళ్ళ సర్వీసు గడిచి పోయింది. ఇంకో అయిదేళ్ళు యిలాగే పనిచేసి రిటయిరైతే, ఆ తరువాత కొన్ని ముఖ్య విషయాలను గురించి తీరిగ్గా ఆలోచిస్తూ కూర్చోవాలన్న సదుద్దేశం మాత్రం లేకపోలేదు. ఐనా యిప్పటికిప్పుడు జబ్బులెందుకొస్తాయన్న ప్రశ్నకు గాక పోయినా, అవి ఎవరికోసం వస్తున్నాయో చెప్పగలను. కానీ ఎందుకులే బాబూ, చెబితే మళ్ళీ నీకు కోపం రావచ్చు. . . ."

"పరవాలేదు చెప్పండి మేష్టారూ. . . ." ప్రాధేయ పడ్డాడు మూర్తి.

"జబ్బు లెందుకొస్తున్నాయన్న విషయముంది చూచావూ, అదొక మహా రహస్యం ! ఆ రహస్యం కాస్తా తెలిసిపోతె వెను వెంటనే దానికి నివారణోపాయాలు గూడా తయారౌతాయి. ఆ తరువాతి పరిణామాలను గురించి నేను వేరే చెప్పాలా మూర్తీ ! బయట తగిలించుకున్న బోర్డులను పూడబెరికి, డాక్టర్లు, తమతమ వైద్యాలయాలను మూసుకోవలసిందే గదా !"

మేయబోయి మెడతగిలించుకున్న చందంగా యిరుకున పడిపోయాడు మూర్తి. కానీ అంతలోనే తెప్పరిల్లి "అయితే

డాక్టర్లుండడం అనారోగ్య నివారణకే గానీ ఆరోగ్య పరిరక్షణకు కాదని మీ అభిప్రాయం'' అన్నాడు.

''బాబ్బాబూ! మీకు పుణ్యముంటుంది. ఈ జబ్బుల గొడవ కాస్త కట్టిపెట్టి మరేదైనా లోకాభిరామాయణంలోకి దిగగూడదూ!'' మంచి నీళ్ళకోసం లోపలికి వెళ్తూ అంది శ్రీదేవమ్మ.

మొదటి ఆటనుంచీ తిరిగి వెళ్తున్న సినిమా ప్రేక్షకులతో బాటుగా యిల్లు చేరుకున్నాడు మూర్తి. పడుకున్నాడే గానీ నిద్రపట్టిందిగాదు. ఈ రోజు మేష్టరుగారి ద్వారా అవగతమైన విషయం తనకు క్రొత్తదేమీ గాదు. డాక్టర్ల తోడ్పాటు తమ కెంతగా అవసరమైనా లోకుల కెందుకో వాళ్ళపట్ల సదభిప్రాయం ఉన్నట్టు తోచదు. చిన్ననాడు తను హైస్కూల్లో చదువుకునే రోజుల్లో 'డాక్టరా, లాయరా, ఎవరు గొప్ప' అన్న విషయం పైన ప్రసంగాలు జరిగేవి. లోకంలో టీచర్లు, గుమాస్తాలు, దర్జీలు, యిన్ష్యూరెన్సు యేజంట్లు మొదలైన వృత్తిదారు లెందరో ఉండగా, డాక్టర్లకు, లాయర్లకు మాత్రం లంకెగలిపి వారిలో ఎవరు గొప్ప ఎవరు తక్కువ అన్న మీమాంసకు పూనుకోవలసిన అవసరమేమిటో తన కర్థమయ్యేది గాదు. బహుశా యిది కారణమైతే గావచ్చు— ఈ రెండు వృత్తులూ ప్రధానంగా మానవుడి బలహీనత పైన ఆధారపడి కొనసాగేవి. న్యాయాన్ని ధిక్కరించడానికి కారణం మానసిక దౌర్బల్యమైతే, జబ్బులకు గురికావడానికి హేతువు శారీరక బలహీనత. కానీ తమతో ఎదుటివాడికి ఏర్పడిన అవసరంలో నుంచీ ఎంతగా వీలైతే అంతగా డబ్బు పుట్టించాలన్న కక్కుర్తి పైన పేర్కొన్న రెండు వ్యక్తులకే పరిమితమైనదేమీ గాదు. క్లాసులో కందంపుడు మాటలే చెబుతూ వచ్చి, పరీక్షలకు ముందుగా తమ దగ్గర ట్యూషన్లు చెప్పుకోకపోతే గడచి గట్టెక్కడం అసాధ్యమని హెచ్చరికలు పలికే ఉపాధ్యాయులెంతమంది లేరు? పడవలసిన మామూలు జేబులో పడితే గానీ ఫైలును టేబిలు దాటనివ్వని గుమాస్తా లెంత మంది లేరు? జీవితానికి సంబంధించిన ప్రతిరంగంలోనూ నిస్వార్థంగా సేవచేయడానికి ఎంతటి అవకాశమైతే ఉందో, దగా చేసి మూటలు ముల్లెలూ కట్టుకోడానికైనా అంతే అవకాశం ఉంది. మరైతే ప్రత్యేకించి లాయరీ, డాక్టరీలను మాత్రం తప్పుబట్టడం ఏం న్యాయం?

ఈ అన్యాయానికి తోడుగా తమకు జబ్బులు రాకపోతే డాక్టర్లు బ్రతకలేరన్న వితండవాదం ఒకటి! అప్పటికి డాక్టర్లు నిక్షేపంగా బ్రతుకు గడచి పోవాలన్న ఉదార బుద్ధి గలిగినవారై స్వప్రయత్నంతో జబ్బులు కొని తెచ్చుకున్నట్టు తన కోడి, తన కుంపటీ లేకపోతే లోకానికి తెల్లవారదనుకున్న ముసలమ్మలా తమకు జబ్బులు రాకపోతే డాక్టర్లకు బ్రతుకు లేదని భావిస్తున్నట్టున్నారు లోకులు! అబ్బే, యిదేం బాగుండటం లేదు!

మరునాటి ఉదయం కొంత ఆలస్యంగా నిద్రలేచాడు మూర్తి. అరగంట ఆలస్యం అయిందేమో, ఆసుపత్రికి వెళ్ళేసరికి వెయిటింగు రూం నిండుకూ క్రిక్కిరిసి ఉన్నారు రోగులు. వేళకింత తిండీ నీళ్ళూ తీసుకుంటున్నట్టుగా ప్రతి రోజూ యిన్ని మందునీళ్ళు లోపలికి పుచ్చుకుంటూ జబ్బుకు అలవాటు పడిపోయిన పాత రోగులు కొందరు డాక్టరుగారిని సందర్శించారు. వాలకాన్నిబట్టి చూస్తే మానవుడు ఆరోగ్యంగా, ఆనందంగా బ్రతకవచ్చునన్న స్పృహే వారి కున్నట్టు లేదు. హిమాలయాలపైన గడియ కొక రకంగా వాతావరణం మారుతుందని చెబుతారు. ఆవిధంగా ఒకప్పుడు బాగా తగ్గినట్టు కనిపించి, మరొకప్పుడు విపరీతంగా విజృంభించినట్టుగా తోచే రోగ ప్రభావం క్రింద రంగులు మార్చుకుంటూ సహజ సౌందర్యాన్ని గోల్పోయినవాళ్ల ముఖాలకేసి చూస్తూ డాక్టరు మూర్తి నిర్విణ్ణుడైపోయాడు. వీళ్ల నిస్సహాయ పరిస్థితిని మాటల్లో వర్ణించి చెప్పడం కష్టం. లేదంటే ఒక పోలిక చెప్పవచ్చు. బలవంతుడు, దుర్మార్గుడు అయిన శత్రువుడికి, వాడు శత్రువన్న సంగతి తెలుసుకోకుండా స్వంత యింటిని అద్దెకిచ్చి, వాడా యింటి నిక ఖాళీ చేయడం కుదరదని భీష్మించుకుని కూర్చుంటే, ఏం చేయడానికి పాలుపోక పంచలో బిక్కుబిక్కుమంటూ కూర్చున్న యింటి యజమానిలా వీళ్లు తెల్లబోయి ఉన్నారు. పారిపోయిన ఈచవిటేపవుల్లో ఉద్యానవనాలు తల లెత్తకపోతేమానె! పచ్చికైనా మొలవదా అన్నదే వీళ్ల ఆశ! స్వరాజ్యం ఒకరు వేరొకరికి ప్రసాదించే భిక్షం కాదనీ, అది ఎవరికి వారే సంపాదించుకోవలసిన జన్మహక్కనీ అన్నాడట మహాత్ముడు. ఆరోగ్యానికి సంబంధించినంతవరకూ అలాంటి ఆత్మవిశ్వాసం వీళ్లలో ఏనాడో నశించిపోయినట్టుంది .....

వైద్యశాస్త్రం అనారోగ్యానికి బోలెడన్ని కారణాలను ఏకరువు పెడుతుంది. నివారణోపాయాలు గూడా చెబుతుంది. విచిత్ర మేమిటంటే వైద్యశాస్త్ర విజ్ఞానం పెరిగిన కొద్దీ క్రొత్తగా కొన్ని జబ్బులూ పుట్టుకొస్తున్నాయి. వాటికి చిత్ర విచిత్రమైన చికిత్సా విధానాలూ అన్వేషింపబడుతున్నాయి. కానీ ఆరోగ్యవంతుడి కిదంతా కాబట్టడం లేదు. అతడు తన జీవితాన్నొక మధురగీతంలా ఆలాపించుకుంటూనే ఉన్నాడు.

అలాగని ఆరోగ్యవంతుడైన మానవుడు ఆరోగ్య శాస్త్రాన్ని క్షుణ్ణంగా చదివి దాని సలహాలను, హెచ్చరికలను విధిగా పాటిస్తున్నా డనడానికి దాఖలాలు లేవు.

డాక్టర్లు రోగనిదానం చేయగలరు. ఔషధాలు నిర్ణయించగలరు. పథ్యం చెప్పగలరు. అంతకుమించిన గారడీ పనితనంతో జబ్బులను మటుమాయం చేయలేరు. కానీ ఈ వాస్తవాన్ని రోగులు గుర్తించరు. ఒక చిన్న మాత్రగానో, ఒకటి రెండు ఔన్సుల ద్రవంగానో, కొన్ని గ్రాముల పూదిమందుగానో సర్వరోగ నివారణిగా ఒక దివ్యౌషధాన్ని వైద్యశాస్త్రం కనిపెట్టగలిగితే బాగుండున్నదే వాళ్ల కోరిక. శాస్త్రం అందులో కృతకృత్యత నందుకోగలిగే సూచనలు కనుచూపుమేరలో కనిపించవు. ఎటొచ్చి ఉపాయాంతర మొక్కటే కనిపిస్తుంది. దుఃఖాల కన్నింటికీ కోరికలే కారణం గనుక, తీర్చుకోడానికి ప్రయత్నించడంకన్నా వాటిని సమూలంగా తుడిచిపెట్టడమే మంచిదని తత్వజ్ఞులు చెబుతారు. అవిధంగా ఆలోచిస్తే జబ్బులకు నివారణోపాయాలు కనిపెట్టడంకన్నా, ఆరోగ్యానికి మూలకారణం కనిపెట్టడమే సులభమేమో!

ఉదయం పది గంటలకు ఆసుపత్రిలో పని ముగిసిన తర్వాత పట్టణంపైన మొదటి రౌండు బయల్దేరాడు మూర్తి. వెళ్లవలసిన నాలుగైదు చోట్లకూ వెళ్లి యింటికి తిరిగివస్తూ గడియారం చూసుకున్నాడు. గంట పదకొండు. భోజనానికి యింకా కొంత వ్యవధి లేకపోలేదు. దారిలోనే తగులుతుంది మేష్టరుగారి యిల్లు. పెద్దమ్మకు అచ్చంగా జబ్బులాంటిదేదీ లేకపోయినా దానికి సంబంధించిన అనుమానాలు దండిగా ఉన్నాయి. వాటిని గురించి ఆమె చెప్పడానికైనా, తాను వినడానికైనా మేష్టరుగారి సాన్నిధ్యంలో బొత్తిగా వీలుండదు. పనిలో పనిగా ఆమెనుగూడా పలకరించుకుని వెళ్లిపోతే ఆదనంగా యింకొకపని గూడా ముగిసినట్టవుతుంది.

"ఏం చేస్తున్నారు పెద్దమ్మగారూ! దారిలో వెళ్తూ యిలా వచ్చాను. పది రోజులప్పుడు నే నిచ్చిపోయిన మందు ఎలా పనిచేసిందో చెప్పారుగారు" అంటూ కూర్చీలో కూర్చున్నాడు మూర్తి.

"అయ్యో, మతిమరుపా! చెప్పానుకానా మూర్తీ! పదీ రోజులకని చెప్పావుగదూ! మందు తియ్యగా ఉందేమో, మూడు రోజులకే బాటిలు ఖాళీ అయిపోయింది. చెబితే నువ్వే మనుకుంటావోనని గమ్మునుండిపోయాను ...."

పెదమ్మలో యింకా పసితనం మాసిపోనందుకు లోలోపలే నవ్వుకున్నాడు మూర్తి.

"ఏదో నీ అక్కరకొద్దీ నువ్వేదో మందు లిస్తున్నావు గానీ, పుచ్చుకుంటున్నానని తెలిస్తే మీ మేష్టరుగారు మండిపడతాడు. నీరసంగా ఉంది అంటాననుకో—వెళ్లి భోజనం చేయమంటారు. చెమటలు పోస్తున్నాయంటా ననుకో, స్నానం చేయమంటారు. నిద్రపట్టలేదంటా ననుకో, కాసేపేదైనా చదువుకోమంటారు. అంతేగానీ దీని కేదైనా మందో మాకో చూడాలన్న ధ్యాసే ఉండ దాయనకు ...."

"మితిమీరిన నీరసం, మాటిమాటికి చెమటలు పట్టడం, రాత్రుల్లో నిద్రలేకపోవడం యివన్నీ అనారోగ్య లక్షణాలు. ఈ చిన్నెలు పొడసూపినప్పుడు జాగ్రత్త వహించడం మంచిది. ఆరోగ్యంపట్ల నిర్లక్ష్యం పనికిరాదు" అన్నాడు మూర్తి.

"ఒక్కసారా, రెండుసార్లా మూర్తీ! లక్షసార్లు చెప్పి ఉంటాను. చెబితే వినే రకమా! వద్దు వద్దని చెబుతున్నా సరే తమ ధోరణి తమది! ఉదయం అయిదు గంటలకే నిద్రలేస్తారు. పండు చలిగా ఉన్నా, జడివానలా మంచు కురుస్తున్నా బయటికి వెళ్లి భళ్లుమని తెల్లవారాక యింటికి తిరిగొస్తారు. ఎనిమిది గంటలకు ఓ గ్లాసుడు పాలు త్రాగితే, మళ్లీ పన్నెండుకు పైన్నే భోజనం. సాయంకాలం టిఫినుచేసి పెడతానంటే, ససేమిరా వద్దంటారు. ఎందుకని నిలదీసి అడిగితే ఏడు ఏడున్నరకల్లా ఏకంగా భోజనమే చేయవచ్చును గదా, మళ్లీ మధ్యలో టిఫిను దేనికని ఎదురు రెట్టేస్తారు..."

"ఆ రెండుపూటలైనా ఆయన తృప్తిగా తింటున్నారా అన్నదే నా సందేహం!" ఆరోగ్యానికి మూలకారణాలను ఆరా తీసే ప్రయత్నంలో ఉన్నాడు మూర్తి.

"అయ్యో రాతా! ఆమాటెందుకులే మూర్తీ! ఇది బాగుంది, ఇది బాగాలేదు అన్నమాటే లేదు. చేసిపెట్టిందల్లా శుభ్రంగా తినేయడమే! అదేమిటని అడిగితే ఆకలికి రుచేం తెలుస్తుందని ఒకటే నవ్వు ...."

ఆరోగ్యాన్ని కొలవడానికి ఉపకరించే బెరామీటర్లు రెండు. మొదటిది ఆహారం. రెండోది నిద్ర. బాగా ఆకలి వేస్తే, సుఖంగా నిద్రపడితే—ఆ పరిస్థితిలో ఆరోగ్యం ఢోకా లేకుండా ఉందన్నమాటే! జఠరాగ్ని ప్రకోపం జాజ్జ్వల్యమానంగా ఉన్నట్టయితే ఆరోగ్యం సగం మేరకు నిక్షేపంగా ఉందనే చెప్పవచ్చు. మిగిలిన సగం సంగతి?

"తొమ్మిదిన్నర అయ్యా కాకముందే నేను వెళ్లిపోతుంటానా పెద్దమ్మగారూ! ఆ తరువాత గూడా చాలాసేపు

చదువుతూ కూర్చుంటారా మేష్టారుగారు ? అర్ధరాత్రి దాటిందే పడుకోరా ?'' ప్రశ్నించాడు మూర్తి.

''బాగా చెప్పావులే మూర్తీ ! గంట పది కొట్టడమే ఆలస్యం. మేష్టారుగారి విషయంలో పడుకోవడం వేరు, నిద్ర పట్టడం వేరు కాదు. పడుకోవడమంటే నిద్రపట్టిందన్నమాటే!''

ఏవో వివరాలైతే తెలిశాయి గానీ 'క్లూ' మాత్రం దొరికిందిగాదు—

డాక్టరుగారి ద్విచక్ర శకటం మళ్లీ పురవీధుల వెంట బయల్దేరింది. మార్గ మధ్యంలో శంకరశాస్త్రిగారు ఎదు రయ్యారు. బిగ్గరగా కేకబెట్టి ఆయన మూర్తిని సైకిలు నుంచి క్రిందికి దింపించారు.

''అదేమిటోయ్ మూర్తీ ! చిన్ననాటి గురువుని ! డాక్ట ర్లకు చిరకాల మిత్రుణ్ణి! నిరంతర వైద్యశాస్త్ర ప్రయోగా లకు ఎడతెగని ముడిసరుకుని ! నన్ను పలకరించకుండా వెళ్లి పోవడం న్యాయమా ?'' నిలదీసి అడిగా రాయన.

''అబ్బే. నేను మీవైపు చూడ్డం తటస్థించలేదండీ మేష్టారుగారూ ! సెలవులో ఉన్నారేమిటి ?''

''అవూ ఏందుకులే మూర్తీ ! కాజువల్ లీవులు, ప్రివిలేజి లీవులు జానుకే ఖాళీ అయిపోయాయి. సిక్‌లీవు గూడా గడువు మీరిందని లాస్ ఆఫ్ పే చేస్తామంటున్నారు. సింహాద్రి డాక్టరుకు రెస్టు రెస్టనడం పరిపాటి. రెస్టువల్ల నాకు కలిగే నష్టం సంగతి ఆయన ఆలోచించడు. అప్పటికీ హెడ్మాస్టరుగారు మంచివారు గనుక నా ఆటలు సాగు తున్నాయి....''

''అన్నట్టు హెడ్మాస్టరుగారి కెప్పుడూ ఇలాంటి సెల వుల్ని వాడుకునే అవసరం తగలదా మేష్టారుగారూ ?'' కుతూ హలంతో అడిగాడు మూర్తి.

''ఆయనా ! ఆయనకు సెలవు లెందుకు ? ఆదివారం నాడు తప్పనిసరిగా బడి మూసేయవలసి ఉంటుందనే ఆయ నకు విచారం ! ఇంచుమించుగా నేనూ ఆయనతోబాటుగానే సర్వీసులో చేరాను మూర్తీ ! ఆనాటినుంచీ చూస్తున్నాను. ఒళ్లు నలతగా ఉందన్న కారణంతో ఓ అరరోజు సెలవు పెట్టిన పాపాన పోయాడుకాడు మహానుభావుడు ! ఏ అమ్మ గన్న బిడ్డో, ఏ అమృతరసాయనం సేవించాడో, దినదిన ప్రవర్ధమానమైన ఆయన ఆరోగ్యభాగ్యానికి వెనుకనున్న కిటుకేమిటో .....''

ఆర్థోక్తిలో ఆగి పోయారు శాస్త్రిగారు. మూర్తి గూడా ఆక్షణాన అనివార్యంగా ఓ సందేహం కలిగినమాట నిజం ! హెడ్మాస్టరుగారన్న పేరుతో వ్యవహరింపబడుతున్న ఈ వ్యక్తి నిజంగా ఒక మనిషేనా, కా...తే నియమబద్ధంగా పనిచేస్తున్న ఒక యంత్రమా అని ! మనిషైతే ఒకప్పుడు గాకపోయినా ఒకప్పుడు రోగాలకు రొష్టులకు లొంగడం సహజం ! మరలు విరిగిపోవడంవలన, బిస చెడిపోవడంవల్ల ఒక్కొక్కప్పుడు యంత్రమైనా దారితప్పడం కద్దు ! మేష్టారు గారు రెంటికీ చెడిన రేవడిలా ఉన్నారు !

అన్వేషణకు ఫలితంగా ఒక అసందిగ్ధమైన నిర్ణయానికి చేరుకోలేక పోయాడు మూర్తి. భాగ్యలక్ష్మికి మల్లే ఆరోగ్య లక్ష్మి కూడా ఆ కారణంగానే కొందరిని అనుగ్రహిస్తుందేమో! మరి కొంత మంది ఎంతగా వేడుకొన్నా దగ్గరికి రాక దవుదవ్వు లనే ఉండి పోతుందేమో....

*          *          *          *

విజ్ఞానం అంతు లేనిది. తృష్ణ అంతకన్నా అంతులేనిది. ఆ రెండు కలిస్తే ఇక చెప్పేదేముంది? జ్ఞాన తృష్ణ పూర్తిగా ఉపశమించడానికి కొన్ని ఆయుష్షులాలైనా చాలక పోవచ్చు.

నాలుగేళ్ళ శాస్త్రాధ్యయనంలోనూ, ఒకటి రెండేళ్ల అను భవంతోనూ మూర్తికి సంతృప్తి కలిగింది కాదు. శస్త్ర చికిత్స పైన క్రొత్తగా కనుగొన్న విశేషాలను అభ్యసించే నిమిత్తం ఉత్తర దేశం వెళ్ళి రెండేళ్ళ ఒప్పందం పైన అక్కడొక మిషన రీ ఆసుపత్రిలో అతడు ఉద్యోగానికి కుదిరాడు. నిపుణులైన వైద్యులు, కొంగ్రొత్త చికిత్సా విధానాలు, ఆధునికమైన ఉపకర ణాలు, అన్నింటినీ మించి వైద్య శాస్త్రంలో ఏ ప్రయోగం చేయాలన్నా అందుకనువుగా లభ్యమయ్యే జబ్బులు, అంతా బాగానే ఉందిగానీ ఎందుకో తన హృదయంలో అశాంతి చోటు చేసు కుంటున్నట్టు తోచింది మూర్తికి! బహుశా వూరు విడిచి దూరప్రాంతానికి తరలిరావడమే అందుకు కారణం గావచ్చు. ఐనా ఈ ప్రవాస జీవితం ఎంతకాలం ? ఈ చూస్తుం డగానే రెండేళ్ళు గడచిపోవూ ! కార్యసాధకుడు కష్టాన్నిగానీ సుఖాన్ని గానీ లెక్కకు రానీయడని భర్తృహరి చెప్పనే చెప్పాడుకదా !

రెండేళ్ల శిక్షణ కాలంలో ఆరుమాసాలు గడచిన తరువాత ఓ రోజురాత్రి మలిజాము వేళ వాలు కుర్చీలో కూర్చుని ఆనాటి టపాలో వచ్చిన దినపత్రిక చదువుకుంటూన్నాడు మూర్తి. పతాక శీర్షికలో నదీజలాల తగాదాను పరికించి, రెండో పేజీలో క్రీడా విశేషాలను గమనించి, మూడో పేజీలోనికి వచ్చేసరికి తనకోసం కాచుకుని ఉన్న మహత్తరమైన వార్త ఒకటి

మూర్తి కళ్ళెదుట దృగ్గోచరమైనది. రెండు కాలంలమేరకు విస్తరించిన ఆ వార్త కనుబంధంగా ఓ ఛాయాచిత్రంకూడా ప్రచురింపబడింది. రాష్ట్రపతి దగ్గరినుంచీ ఓ ఉపాధ్యాయుడు బహుమానం అందుకుంటున్న దృశ్యం. జాతీయ గౌరవానికి పాత్రుడైన ఆ ఉపాధ్యాయుణ్ణి మొదటి చూపుల్లోనే పోల్చుకోగలిగాడు మూర్తి. వెంటనే వార్తను సాకల్యంగా చదివేశాడు. విద్యాబోధనకు జీవితాన్ని అంకితంచేసి ఆరంగంలో దేశానికి గొప్ప సేవచేసిన ఆచార్యులను జాతీయ స్థాయిలో గౌరవించడం ఇటీవలి సాంప్రదాయం. ఈ ఏడు ఆ విధంగా గౌరవింపబడిన నలువదిమంది ఉపాధ్యాయుల్లో నారాయణరావు గారొక్కరు. వార్త క్రింద సంగ్రహంగా జీవిత విశేషాలను పొందుపరచడంగూడా జరిగింది. ఒకే పాఠశాలలో ముప్పై ఏళ్ల సర్వీసు. బడిని గుడిగా దిద్దితీర్చిన కార్యదీక్ష. ఎన్ని ఒత్తిళ్ళు వచ్చినా నీతిపథంనుంచీ తప్పి నడవని ఆసిధారావ్రతం. ఇంకా సంఘసేవా కార్యక్రమాలు.............

ఐదు నిముషాలవరకూ కళ్లుమూసుకుని నిశ్చలంగా కూర్చున్నాడు మూర్తి. అంతసేపూ అలౌకికమైన తన్మయత్వాన్నే భజించాడు. న్యూఢిల్లీ నగరం. రాష్ట్రపతి భవనం. సభాసీనులైన పెద్దల సమక్షాన సన్మానం. ఆ దృశ్యాలన్నీ అతడి మనోనేత్రం ఎదుట సాక్షాత్కరించాయి. పోగా చిరకాలంనుంచి తనను వెంటాడుతూ వచ్చిన ఓ ధర్మసందేహంనుంచీ విముక్తి పొందినట్లుగా మనసు తేలికపడిందిగూడా! ఇది మానవ సామ్రాజ్యంపైన యాంత్రిక నగరికత పెత్తనం చలాయిస్తున్న కాలం. నిజమైన పనితనంతో గాకుండా పోజులుపెట్టి డాబులుకొట్టి పబ్బం గడుపుకపోవడానికి వీలున్న రోజులు. జీవితకాలంలోనూ, జీవశక్తిలోనూ ఎక్కువ భాగాన్ని ఒక సంస్థకు, లేదా ఒక సత్కార్యానికి ధారపోసిన వ్యక్తులకు పరిగణనే లభించదేమోనన్నదే తన సందేహం! ఆ సందేహం వట్టి సందేహమేననీ, సిద్ధాంతంకాదనీ తేలిపోయింది.

అప్పటికప్పుడు తన ఆనందాన్ని ఉత్తరంలో ఇమిడ్చిన తర్వాతగానీ మూర్తికి నిద్రపట్టిందిగాదు. తోటలో పువ్వులు పూస్తే వాటిలో భగవంతుడి కైంకర్యంలో చరితార్థత పొందేవి కొన్ని. భామినుల కేశపాశాలకు అలంకారాలుగా చెన్ను మీరేవి కొన్ని. పరిమళద్రవ్యాల తయారీకి ఉపకరించేవి కొన్ని. ఆకులో రాలని, పూలువాడని వసంతవనంలాంటిది విద్యాలయం. విద్యార్థుల పువ్వులు. ఉపాధ్యాయుడే తోటమాలి. అట్టే ఎందరు శిష్యులు మేష్టరుగారికి! విదేశాల్లో ఉన్నతోద్యోగులుగా కొందరు. మంచుకొండ శిఖరాల్లో మాతృదేశ రక్షణార్థమై దీక్షా కంకణులై కొందరు. దారిద్ర్య నిర్మూలనంకోసం నదీజలాలకు ఆనకట్టలు కట్టే బృహత్కార్యాల్లో నిమగ్నులై కొందరు. ఇంకా తనలాంటి డాక్టర్లు, కార్మికులు, గుమస్తాలు—వేల సంఖ్యలో ఉన్న శిష్యుల కింతకంటే శుభ వర్తమానం మరేముంటుందా ? వందల కొలది అభినందన లేఖల్లో తనదీ ఒకటి—

మరునాటినుంచీ మరింత శ్రద్ధగా దినపత్రికను గమనింపసాగాడు మూర్తి. ఏ వార్తల కోసమైతే తానెదురు చూచాడో అవి ఒకరోజు గాకపోతే మరొక రోజు, ఒక చోట గాకపోతే మరొక చోట, విపులంగా గాకపోతే టూకీగానైనా కనిపించేవి. ముఖ్యంగా చెప్పుకోదగినది పురపాలక సంఘంవారు మేష్టరుగారికి చేసిన పౌరసన్మానం. అంతకుమునుపు ఆయన రాజధానినుంచి తిరిగివచ్చిన సందర్భంలో జరిగిన ఊరేగింపు గూడా గణనీయమైనదే ! దారిపొడుగునా మేళతాళాలతో పుష్ప వర్షంతో, విద్యార్థుల కోలాహలంతో సాయంకాలం ఆరుగంటలప్పుడు స్టేషను దగ్గర ప్రారంభమైన ఊరేగింపు మేష్టరుగారిల్లు చేరుకునేసరికి రాత్రి పది గంటలు కావచ్చింది. మరునాడు పాత విద్యార్థుల సంఘంవారు పట్టు శాలువాలు కప్పి రజత శారదా విగ్రహాన్ని బహూకరించారు. సభావేశానికి అధ్యక్షత వహించిన జిల్లా కలెక్టరుగారు మేష్టరుగారికి ఆ గౌరవం లభించడంలో ఉన్న ఔచిత్యాన్ని గురించి నాలుగు మాటలు చెప్పారు — "మానవుడికి ఘనత నాపాదించే హంగులు చాలావున్నాయి. మొదటిది డబ్బు. లాటరీలో లక్షరూపాయలు రావచ్చు. అవినీతే ప్రాతిపదికగా అంత మొత్తం గడించవచ్చు. అలాకాకుండా న్యాయానికి సేవలేని పద్ధతిలో లక్ష రూపాయలు గడించడంలో విశిష్టత ఉందని చెబితే అందు కభ్యంతరం చెప్పే వాళ్ళుండరు. మేష్టరుగారికి కీర్తి లాటరీలో వచ్చిన ప్రైజు గాదు. కనుకట్టుతో మంత్రతంత్రాలతో సంపాదించిందిగాదు. దాని వెనుక ముప్పదేళ్ల నిర్విరామ కృషి ఉండనే ఉంది"

మూర్తి మరి కొంత దూరం ఆలోచించాడు— నిజమే! సేవ, త్యాగం, ఉపకార పారీణత మొదలైన సద్గుణాల వల్ల జేబులు నిండవు. కీర్తి మాత్రమే లభిస్తుంది. అది గూడా లభించక పోతే ఇక లోకంలో సదుద్యమాలకు, సదుద్దేశాలకు తావే ఉండదేమో!

మూడు మాసాల వరకు పత్రికలో అడపాదడపా సన్మాన వార్తలు చూస్తూ వచ్చాడు మూర్తి. బడిలోని పిల్లలందరూ కలిసి ఒకసారి ఉపాధ్యాయులందరూ ఒకసారి మేష్టరు గారిని సన్మానించారు. జిల్లాలోని పేరెన్నిక గన్న పాఠశాలలు ఆయన్ను పిలిపించుకుని విందులిచ్చి వేనోళ్ళ ప్రశంసలు కురిపించి తమ వంతు తాముగా చెల్లించుకున్నాయి. ఎటొచ్చీ మూర్తికి

కొక్కటే కొరత. ఆ ఆనందంలో తను పాలు పంచుకోడానికి వీల్లేక పోయింది. ఉత్సాహ సంరంభంలో ఉండిపోయారేమో, మేష్టరు గారు తన జాబుకు బదులు గూడా వ్రాశారు కారు.

అక్కడ తన జాబుకు జవాబు రాసందుకు మూర్తి కించ పడడము, యిక్కడ రావుగారు అతని జాబుకు బదులు వ్రాయడము రెండూ బహుశా ఒక్కసమయాన్నే జరిగి ఉండవచ్చు. మూడోనాటి సాయంకాలం టపాలో మూర్తి ప్రత్యుత్తరం అందుకున్నాడు. ఒకటికి రెండుసార్లు చదివాడు. చదువుతగా అది మేష్టరు గారు తనకు వ్రాసిన ఉత్తరం కాదేమో ననుకున్నాడు. కాకపోతే మేష్టరు గారికి అనారోగ్యమా! అందులోనూ తీవ్రమైన అనారోగ్యం! పాఠశాలకు రెండు నెలలు సెలవు పెట్టవలసిన అనారోగ్యం! ఇలా జరగవచ్చునని తన కలలోనైనా అనుకోలేదు.....

విచ్చిపోయిన దుర్గంలోనికి శత్రువులు చొచ్చుకుని వచ్చినట్లుగా మేష్టరుగారి ప్రశాంత జీవనంలోకి అనారోగ్యం ఎలా ప్రవేశించినట్టు? ఎలా ప్రవేశించిందో గానీ ఉత్తరంలో ముప్పాతికా మువ్వీసం వంతు దాని వర్ణనతోనే సరిపోయింది. ఎంతోకాలం సాధన చేస్తేగానీ భక్తుడికి భగవంతుడి పైన ఏకాగ్రత కుదరదు. రోగి సంగతలా కాదు. రోగి ధ్యాసంతా రోగంపైకి మళ్ళడానికి ఎంతటి స్వల్ప కాలమైనా చాలు...

మూడో పర్యాయం ఉత్తరం చదువుకున్నాడు మూర్తి.

"తన సంతోషమే స్వర్గము, తన దుఃఖమే నరకమన్న ఆర్యోక్తిని ఎరుగుదువా మూర్తీ! ఆ మాటలో నింతో నిజం ఉంది. నువ్వు క్యాన్సరంటావు. టి. బి. అంటావు. అదంటావు. ఇదంటావు. కానీ అవన్నీ న జబ్బు ముందు దిగదుడుపుకైనా పనికిరావని నేననుకుంటాను. డాక్టర్లతో సంప్రదించడం మూడు మాసాల క్రిందటె ప్రారంభమైంది. ఆ ప్రారంభం ఏ దుర్ముహూర్తాన జరిగిందో గాని నాటి నుంచీ నేటి వరకూ ఈ వ్యాధి రోజుకొక విచిత్ర విన్యాస పరిణామంతో నన్ను వేధించుకు తింటోంది. కొంతసేపు కుర్చీలో కూర్చుంటే వెన్నుముకలోపలి భాగాన సూదులతో పొడిచినట్టు బాధగా ఉంటుంది. అరమైలు దూరాన నడిస్తే బడలిక వల్ల ఎక్కడ బడితే అక్కడ కూలబడి పోదామనిపిస్తుంది. ఒక్కొక్కప్పుడు ఎందుకో హఠాత్తుగా తలనొప్పి తరుముకొచ్చేస్తుంది. రైలు రానున్నందుకు గుర్తుగా రెక్కమాను వంగడంలేదా మూర్తీ! ఆ మాదిరిగా నొప్పిరావడానికి ముందుగా పటకారుతో బిగనొక్కినట్టుగా తల ఇనుప గుండులా స్తబ్ధమై పోతుంది. ఇవి మాత్రమే గాదు. ఈ అవలక్షణా లన్నింటికీ తలమానికమైనది వేరొకటుంది. నా ఉచ్ఛ్వాస నిశ్వాసాలతో మునుపెన్నడూ నాకు ప్రమేయం ఉండేది గాదు. ఇప్పుడలా కాదు. ఎడమవైపు శ్వాస బరువెక్కినట్టు తోస్తుంది. ఒకప్పుడు ప్రయత్న పూర్వకంగా గానీ ఊపిరాడదు. . . ."

ఉత్తరం పూర్తిగాక మునుపే మూర్తి ఆలోచనలన్నీ ఒక్కసారిగా వైద్యశాస్త్ర వీధుల వెంట పరవళ్ళు త్రొక్క సాగాయి. ఈ అనారోగ్య లక్షణాలకు హేతువైన జబ్బులు నాలుగైదున్నాయి. సామాన్యులైన వైద్యుల్ని ఆ నాలుగైదింటినీ ఒక్కటే పేరుతో వ్యవహరిస్తారు. శాస్త్ర సాంప్రదాయరీత్యా ఆంగ్లంలో దానిపేరు పల్నాడు చెంత్రాటితో పోటీ పడదగినంత పెద్దది. తెలుగులో ముక్తసరిగా నరాలనిస్సత్తువ అని పేర్కొనవచ్చు.

మళ్ళీ ఉత్తరంలో పడ్డాడు మూర్తి.

"నీ పెద్దమ్మ దొకటే గోల! నేను తగు జాగ్రత్త వహించడంలేదని! ఆమె ఉద్దేశంలో జాగ్రత్త అంటే ఏమిటో నా కర్థం గాదు. లోకంలో ఎన్నో వైద్యశాలలున్నాయి. తీరుతెన్నులనుబట్టి చూస్తే అవి రోగాలకు నిలయాలనుకోడానికి మనసొప్పదు. అక్కడ రోగదేవతకు జరిగే పరిచర్య గూడా ఎంతో ఖరీదుతో కూడుకున్నది. పోగా నిష్కర్షగా యింతకాలంలో జబ్బు నయమైపోతుందన్న పూచీ ఏమీ ఉండదు. ఈ పరిస్థితిలో రోజుకు పాతిక రూపాయిల చొప్పున వెచ్చిస్తూ ఆసుపత్రుల్లో ఉండగల స్తోమత నాకు లేదు. లేదని చెబితే నీ పెద్దమ్మ ఒప్పుకోదు. చెవిలో ఇల్లు గట్టుకుని సతపోరుతుంది. రోగమే ఒక బాధ కాగా నాపాలిటికిదొక అదనపు బాధగా పరిణమించింది. డాక్టరు సింహాద్రిగారుండనే ఉన్నారు. ఆయుర్వేద వైద్యులు అప్పల నరసయ్యగారు వారాని కొకటి రెండుసార్లు వచ్చి చూచి పోతున్నారు. ఇక్కడి గవర్నమెంటు ఆసుపత్రికి కనకాచలమని క్రొత్త డాక్టరు వచ్చాడు. నాయీ జబ్బు నయం చెయ్యాలన్న శ్రద్ధ, పట్టుదల పై ముగ్గురిలోనూ ఒకటె సమాన నిష్పత్తిలో ఉందని నా నమ్మకం! కానీ, నీ పెద్దమ్మ అలా అనుకోదు. ఆమె నమ్మకం ఇరుగింటివాళ్ళ, పొరుగింటివాళ్ళ, బంధువులు, మిత్రులు మొదలైన శ్రేయోభిలాషుల సహాయమేరకు దేశంలో ఎందరెందరు ఘనవైద్యులైతే ఉన్నారో, వాళ్ళందరి పైకి శాఖాచంక్రమణం చేస్తుంది. అలాంటి అసంఖ్యాకులైన వైద్యుల్లో నువ్వు ఒక్కడివి. ఆమె దృష్టిలో నీకొక్క అదనపు క్వాలిఫికేషను గూడా ఉంది—నువ్వు నా శిష్యుడవని!"

ఉత్తరాన్ని టేబిలుపైకి విసిరాడు మూర్తి. చివాలున పైకి లేచాడు. పెద్దమ్మ కంగారు పడడంవల్ల నైతేనేమి పరామర్శించే డాక్టర్ల సంఖ్య హెచ్చడంవల్ల నైతేనేమి, మేష్టరుగారికి యిదేదో తీవ్రమైన జబ్బన్న అనుమానం, కలిగినట్టుంది! ఒకవేళ ఇది తీవ్రమైన జబ్బే ననుకుందాం. దివ్యౌషధాలున్నాయి గదా! ముసలి డాక్టర్లకు పాతవాటిపైన్నే గానీ కొత్త మందులపైన విశ్వాస ముండదు. ఇక ఆయుర్వేద వైద్యుడి దృష్టిలో ఆయుర్వేదమే వైద్యం. వాళ్ళు క్రొత్త క్రొత్త వైద్యగ్రంథాలను చదువరు. క్రొత్త మందులను ఉపయోగించి వాటి ఫలితాలను గమనించరు. కాకపోతే ఒకరికి ముగ్గురు డాక్టర్లు చికిత్స చేసినా మేష్టరుగారి జబ్బు నయం కాలేదంటే అర్థమేమిటి? వాళ్ళు దగ్గరుండి చేయలేని పనిని యింతదూరం నుంచి పట్టుమని పది రోజుల్లో చేసి చూపడం తన చేతనౌను.

మరునాడు మూర్తి దగ్గర నుంచి రావుగారి కొక మందుల పార్సెలు వెళ్ళింది. ఔషధసేవనం జరుగుతోందనీ, గుణం కనిపిస్తున్నట్టే ఉందనీ మేష్టరుగారు బదులు గూడా వ్రాశారు.

ఆ జాబును పదిమంది డాక్టర్లకు చూపించాడు మూర్తి. వాళ్ళు పదిమందీ పది రకాల సూచనలు చేయగా వాటి నన్నిటినీ తాను మథించగా, అప్పుడు స్ఫురించిన క్రొత్త మందులను జతచేసి మేష్టరుగారికి మళ్ళీ ఒక మందుల పార్సెలు రవాణా చేశాడు.

నెలరోజులు గడచిపోయాయి.

రావుగారి దగ్గరినుంచీ మూడో ఉత్తరం గూడా వచ్చింది. జబ్బు నయం కావస్తోందట! తనకేవిధంగా కృతజ్ఞత తెల్పుకోవాలో తోచడంలేదట!

*    *    *    *

శిక్షణ కాలం పూర్తయి స్వస్థలానికి మరలివచ్చిన మూర్తి వారం రోజులు హాయిగా విశ్రాంతి తీసుకున్న తరువాత మళ్ళీ బోర్డు తగిలించి డిస్పెన్సరీ తెరిచాడు. ఆలోగా పట్టణంలో తాను కలుసుకోదగిన పెద్దల నందరినీ కలుసుకున్నాడు. ఆ వారం రోజుల్లో అతడు ఒక రోజు రోజంతా మేష్టరుగారి యింటి దగ్గరే గడపవలసి వచ్చింది. పుట్టింటికి వచ్చిన ఆడపడుచుకు జరిగినట్టుగా మూర్తి కక్కడ రాజోపచారాలు జరిగాయి. "ఏం చెప్పమంటావు మూర్తీ! గడచిన అయిదారు నెలలుగా మేము మనుషులమే కామనుకో! అంతగా జంజాటం పడిపోయాము. చివరి కెలాగైతేనేం, కొండలా వచ్చిన ఆపద మంచులా కరిగిపోయింది. అంతా భగవంతుడి కృప" అంది శ్రీదేవమ్మ.

మూర్తికి మనస్సు చివుక్కుమన్న మాట నిజం! ఎంతో కొంత మానవ ప్రయత్నం స్పష్టంగా కళ్ళకు కనిపిస్తుండగా అంతా భగవంతుడి కృపే ననుకోడం ఏం సబబు? ఆ మాటకొస్తే దృగ్గోచరమయ్యే దొక్క మానవ ప్రయత్నమే గదా! భగవంతుని కృప అన్న దొకటి ఉందో లేదో ఎవ్వడెరుగును? లేదంటే ఇందులోని అంతరార్థాన్ని ఈవిధంగా విడమరిచి చెప్పుకోవచ్చు—అవసరాని కెంతగా ఆదుకున్న డాక్టర్లు మానవమాత్రులు మాత్రం గాకపోరు. ఆరోగ్యం చెడిన రోజుల్లో వైద్యుడే నారాయణుడుగా కనిపిస్తే కనిపించవచ్చు. కానీ, ఆ తరువాత డాక్టరుతో అవసరముండదు. రానూ వచ్చి పోనూ పోయిన జబ్బు మళ్ళీ రాకుండా ఉండాలనుకోడం మానవ స్వభావం. ఈ కోరిక నెరవేరడానికి డాక్టరు తోడ్పాటుకన్నా భగవంతుడి కృపే అవసరమేమో!

ఆవిధంగా ఎదుటి వారి ధోరణికి తనకు తోచిన వ్యాఖ్యానం చెప్పుకున్నాడు మూర్తి. కానైతే యిందులో తన ఊహకు మించిన నిజాలు ఉండగలవన్న ఊహ అతడికి లీలగానైనా స్ఫురించిందిగాదు. పదిరోజుల తర్వాత డాక్టరు సింహాద్రిగారితో మాట్లాడుతుండగా విషయం బయట పడింది.

"రెండేళ్ళుగా నువ్వు వూళ్ళో లేకపోయావా మూర్తీ! నువ్వుంటే నాకు కాస్త రిలీఫ్ ఉండేది. ఎందుకులే, న అవస్థ ఆ దేవుడికే ఎరుక! తిండి తినడానికైనా తీరికుండేదిగాదు ప్రతిరోజూ పది పదహేను చోటకు వెళ్ళవలసి వచ్చేది. మిగిలినవన్నీ ఒక ఎత్తయితే హెడ్మాష్టరుగారి కేసే ఒక ఎత్తు. వచ్చిన చిక్కు ఆయనతో గాదు. ఆయన భార్యకు ధైర్యం చెప్పేసరికి తలప్రాణం తోక కొచ్చినంత పనయ్యేది. ఎలాగైతేనేం, ఆ జబ్బును నయం చేసేశాను—ఊపిరి త్రిప్పుకోగలిగాను....."

"మీరు నయం చేశారా?" అప్రయత్నంగా ప్రశ్నించాడు మూర్తి.

"మరి? ఈమధ్య నువ్వు అప్పల నరసయ్యను కలిశావా ఏమిటి మూర్తీ! అదేదో సింధూరమట! దాంతో ఆ రోగం నయమైపోయిందని అతగాడు గొప్పలు చెప్పుకుంటున్నాడట! నాతో చాలామంది చెప్పారు ...,'''

"అబ్బె, అప్పల నరసయ్యగారు ...."

"మరైతే డాక్టరు కనకాచలమైనా ఉంటాడు. ఏమైనా అతడి నిజాయితీ మాత్రం మెచ్చుకోదగ్గది. చాటునా మాటునా గాకుండా నా ముఖాన్నే చెప్పేశాడు—హెడ్మాష్టరుగారికి జబ్బు నయంచేసిన ఘనత తనకే దక్కాలని! ఆమాటమీద మాకు జటాపటీ జరగడం గూడా జరిగింది...."

అంతపనికి సిద్ధంగాలేడు మూర్తి. పైగా సత్యాన్ని తేల్చుకోడానికి ద్వంద్వయుద్ధమే సజావైన పద్ధతన్న సూత్రం పట్ల అతడికి నమ్మకం గూడా లేదు. అతడు మెల్లగా పైకి లేచి నేరుగా కథారంగానికే దారితీశాడు.

వెళ్ళిన సమయానికి రావుగారింట్లో లేరు.

"కూర్చో మూర్తీ! ఆరోగ్యం కుదిరిందిగా, అయ్యగారింట్లో లేరు. షికారుకు వెళ్ళినట్టున్నారు. వచ్చేస్తారు కూర్చో" అంది శ్రీ దేవమ్మ.

పది నిమిషాలసేపు ఆమాటా, యీమాటా మాట్లాడి అసలు విషయంలోకి వచ్చేశాడు మూర్తి.

అంతా విన్నాక పెద్దమ్మ గూడా అయోమయమైన అభిప్రాయాన్నే వెలిబుచ్చింది. నిజానికి తమకు గూడా అంతుబట్టని రహస్యం అదేనట! వాడడానికైతే అందరి మందులూ వాడడం జరిగిందట! వాటిలో ఎవరి మందువల్ల ఆరోగ్యం కుదిరిందో గానీ, అది తమ పాలిటి కొక ధర్మసందేహమైపోయిందట!

అప్పుడిక తాను పంపిన మందుల ప్రాశస్త్యాన్ని గురించి ఉగ్గడించక తప్పిందిగాదు మూర్తికి!

"ఉండుండు మూర్తీ! మనలో మనకు సందేహాలెందుకు? అలమారా తెరిచి చూస్తే సరిపోదూ!"

తలుపులు తెరిచింది శ్రీ దేవమ్మ. అలమారా చిన్నసైజు మందులంగడిలా ఉంది. అరల నిండుకూ రకరకాల మందుల సీసాలు, అట్టపెట్టెలు, ప్లాస్టిక్ డబ్బీలు చెల్లాచెదురుగా పడి ఉన్నాయి. కొన్ని సీసాలకు వేసిన సీలు వేసినట్టే ఉంది. మిగిలిన వాటిలో ఒకటి రెండు ఔన్సుల మేరకు ఖాళీ అయివున్న సీసాల సంఖ్యే హెచ్చు. నూది మందులు కొన్ని ఆలనా పాలనా లేకుండా ఒకదానిపైన ఒకటి పడిఉన్నాయి. అన్నింటిలోనూ తాను పంపిన ఔషధాల ఆచూకీ కోసం తీవ్రంగా పరిశీలించి చూడసాగాడు మూర్తి. క్రింది అరలో పార్సెలు కనిపించింది. అది తను రెండోసారి పంపిన పార్సెలు! మందపు కాగితాల దిగ్బంధనంతో, బిగదీసికట్టిన నూలు దారాలతో, ఆఖరుకు లక్కసీళ్లతో సహా అది తనెలాగైతే పంపాడో అలాగే సురక్షితంగా ఉంది!

మూర్తి నిర్విణ్ణుడై పోయాడు. మేష్టరుగారు జబ్బునుంచి కోలుకున్నారు. ఆ కోలుకోడానికి హేతుభూతుడైన వైద్యుడెవ్వరో ఆయనకు తెలిసి ఉండకపోదు. మరైతే ఈయన వరుసగా డాక్టర్లనందరినీ మభ్యపెట్టి ఇలా కపట నాటకం ఆడవలసిన అవసరం ఏమై ఉంటుంది?

శ్రీ దేవమ్మ ఏమిటో మాట్లాడుతోంది. ఆమాటలేవీ మూర్తి బుర్రకెక్కడంలేదు. మేష్టరుగారు చడీ చప్పుడూ లేకుండా ఎప్పుడో వచ్చారు. వచ్చి మూర్తి కెదురుగా కుర్చీలో కూర్చున్నారు.

"వచ్చేశారా! ఆలస్యంగాకుండా సమయానికే వచ్చారు. ఎందుకంటారా! మూర్తి కొక టెంకాయ దొరికింది. దాన్ని పగలగొట్టాలంటే ఇందాకటి వరకూ రాయే కనిపించింది గాదు......"

"ఇప్పుడు కనిపించిందన్నమాట!"—రావుగారు తెరిచి ఉన్న అలమారా వైపు చూశారు. క్వొశ్చన్ మార్కులా ఉన్న మూర్తి ముఖంలోకి చూచారు. అంతకు మునుపు ద్వారంలో అడుగు పెట్టినప్పటినుంచీ హాల్లోకి వచ్చేదాకా ధారాపాతంగా వినవచ్చిన శ్రీ దేవమ్మ ప్రసంగంనుంచీ ఆయన అసలు విషయం కొంత గ్రహించే ఉన్నారు—

"చూడు మిస్టర్ మూర్తీ! ఈ ప్రపంచం ఎలా సృష్టింపబడిందన్న ప్రశ్నను నువ్వు జీవితంలో వందసార్లయినా విని ఉంటావు. అన్నిసార్లూ దాన్ని గురించి ఆలోచించి గూడా ఉంటావు. పైకి చూడ్డానికి అది చాలా మామూలు ప్రశ్న. కానీ, ఒక పట్టాన సమాధానం స్ఫురించని చిక్కు ప్రశ్న కూడా అదే!"

"కావచ్చు."

"అలాగే నువ్వు రెండేళ్లకు మునుపు నన్నో ప్రశ్న అడిగావు ...."

"......."

"నీకు జ్ఞాపకం ఉండకపోవచ్చు. ఏమైనా అది నీలాంటి డాక్టరు, డాక్టరీ విద్యతో ఏమాత్రమూ పరిచయంలేని నాబోటి సాధారణ వ్యక్తిపైన ప్రయోగించవలసిన ప్రశ్న మాత్రం కాదు....."

"........."

"పోనీ, నేనే చెబుతాను. మనుషులకు జబ్బు లెందుకొస్తాయన్నది నీ ప్రశ్న. అవునా మూర్తీ?"

"అవును. దానికి సమాధానం ఎప్పుడైనా తీరిగ్గా ఆలోచించి చెబుతామన్నారు ...."

"ఆలోచించాను. ఈమధ్య కొంతకాలం తీరిగ్గా అంప శయ్యపైన ఉండిపోయానుగదూ! ఒకానొక గొప్ప ప్రశ్నకు సమాధానం తెలుసుకోగలిగాను గనుక ఆ కాలం సద్వినియోగ మైనట్టే!"

"చెప్పండి."

"నాకూ చెప్పాలనే ఉంది. లేనిపోని మాటలతో శ్రోత లను అట్టే విసిగించడం మంచి పద్ధతి గూడా కాదు. కాని నీ ప్రశ్నకు సమాధానం చెప్పేముందుగా నీకో చిన్న కథ చెప్పడం బాగుంటుందేమోనని ......"

"కథకేం భాగ్యం మేష్టారూ? భేషుగ్గా చెప్పండి. అవసరమైతే ఒక ఉపోద్ఘాతాన్ని గూడా జోడించి మరీ చెప్పండి."

"మనిషికి జబ్బులెందు కొస్తాయన్నది నీ ప్రశ్న. మని షికి జబ్బులే గాదు. ఇంకా చాలా వస్తున్నాయి. సుఖాలు, కష్టాలు, ఆనందాలు, ఆందోళనలు మొదలైనవి. చిన్నచిన్న పరీక్షలతో డాక్టర్లు రోగనిదానం చేయగలరు. మనిషి దిగు లుగా ఉన్నాడా, లేక ఆనందంగా ఉన్నాడా అని తెలుసుకో డానికి ఆమాత్రం పరీక్షలు గూడా అక్కర్లేదు...."

"ఎందుకూ! వాలకాన్నొకసారి ఎగాదిగా చూస్తే తెలిసి పోదూ!"

"మనిషి ఆనందంగా ఉన్నాడనుకో! ముఖం విప్పారి కల కల లాడుతుంది. కళ్లల్లో కాంతి చిప్పిల్లుతుంది. శరీరం దూది పింజలా తేలికై ఆకాశవీధుల్లో సంచరిస్తున్నంత హాయిగా ఉంటుంది. మనిషి దిగులుగా ఉన్నాడనుకో! ముఖాన మసి పూసినట్టుంటుంది. శరీరాన్ని లాక్కెళ్లడం ఓ కొండను కది లించినంత శ్రమగా ఉంటుంది. మిన్నులు విరిగి తలపైన పడి పోగా శరీరం భూమిలోకి కృంగిపోతున్న ట్టుంటుంది. మరైతే ఈ శరీరమన్న వెండితెర పైకి యిలా నిరంతరంగా రంగుల్ని ప్రసరిస్తున్న ప్రొజెక్టరు ఏదో చెప్పగలవా మూర్తీ!"

"చెప్పలేకేం మేష్టారూ! దాన్నే 'మనసు' అనవచ్చు."

"వెండితెర ఒక్కటే! ఉన్న రంగులు గూడా కొన్ని మాత్రమే! కానీ ఆరంగుల అన్యోన్య సమ్మేళనంవల్ల ఒకప్పుడు తెరపైని దృశ్యం ఆనందకరంగా ఉంటుంది. మరొకప్పుడు భయంకరంగా ఉంటుంది. సారాంశమేమిటో చెప్పవా మూర్తీ! మనసులో ఉదయిస్తున్న ప్రతిభావవీచికా శరీరంపైన తన ప్రభా వాన్ని ప్రసరిస్తోంది ....."

"అర్థమైంది."

"ఇక కథ చెబుతాను" అన్నారు రావు గారు.

"యుగాల క్రిందటి కథ. ఒక అరణ్యంలో ముగ్గురు రాక్షసు లుండేవారు. మహా బలవంతులు. ఎంద రెందరో ఒక్కొ మ్మడిగా ప్రయత్నించి చూచారు. వాళ్లని గెలవడం సాధ్యం కాలేదు. చివరకు పరాజితు లందరూ కలిసి ఓ మహర్షిని ప్రార్థిం చారు—అసురుల విజయానికి వెనుకనున్న రహస్య మేమిటో చెప్పవలసిందని!

"మహర్షి వివరించాడు: పోరాడుతున్నప్పుడు తాము పోరాడుతున్నామన్న ధ్యాసగానీ, పోరాటం ముగిసిన తర్వాత తాము విజయం సాధించడం జరిగిందన్న స్పృహ గానీ ఆ రాక్షసుల కుండటంలేదు. వాళ్లు తమను తాము విస్మరించి యుద్ధం చేస్తారు. అప్పైన తమ విజయాన్ని గురించే తలపెట్టరు గనుక —విజయోత్సాహంవల్ల వాళ్లు ఉబ్బి తబ్బిబ్బులయ్యే అవకాశమే లేదు. అదే వాళ్ల విజయానికి వెనుకనున్న రహస్యం ...."

"ఐతే వాళ్లని ఓడించడానికి ఉపాయమే లేదా స్వామి!"— పరాజితులు దీనంగా ప్రశ్నించారు.

"లేకేమి!" అన్నాడు మహర్షి—"తాము మహా బల వంతులమన్న స్పృహ వాళ్లకు కలగాలి. తాము విజేతలమన్న గర్వం వాళ్లల్లో ఉద్భవించాలి. యుద్ధం చేసిందీ, విజయాన్ని సాధించిందీ ఈ శరీరమేనన్న స్పృహ వాళ్ల కెప్పుడైతే కలుగు తుందో, ఆ క్షణాన్నే వాళ్ల శరీరాలు వాళ్ల పాలిటికి బంధిఖానా లౌతున్నాయి. నేను చేస్తున్నాననే ధ్యాస, నేను గొప్పవాడినన్న గర్వం—యివి మానవుణ్ణి శరీరమన్న చెరసాలలో నిర్బంధించి వేస్తున్నాయి. ఆ భావాల ఒత్తిడివల్లనే శరీరం నుజ్జు గుజ్జయి పోతోంది. అప్పైన వాళ్లను జయించడం ఎంత పని?"

రావుగారు ముగించారు—"అలాగే జరిగింది. రాక్షసులు ఓడిపోయారు ...."

కొంతసేపు మౌనంగా ఉండి మళ్లీ ఆయనే కొనసా గించారు—"తాను చేస్తున్నానన్న స్పృహ అతీతమైన కర్తవ్య నిర్వహణవల్ల మానవుడు వజ్రకాయు డవుతాడు. అజేయు డవుతాడు. అందుకు విరుద్ధంగా స్వార్థాన్ని గురించిన చింత, కీర్తికి సంబంధించిన ఆకాంక్ష అతణ్ణి దుర్బలుణ్ణిగా చేస్తు న్నాయి. వాటివల్ల మనిషి కృంగిపోతున్నాడు. నీ ప్రశ్నకు సదుత్తరం లభించినట్టేనా మూర్తీ!"

"జబ్బెలా నయమైందో చెప్పారు కారు ...."

"జబ్బొకరు నయం చేసేదిగాదు. ఆరోగ్యం ఎక్కడైతే ఉండాలో అక్కడ ఉండనే ఉంది. జీవితం సాగరమైతే, శరీరమే పడవ. సముద్రజలాలకు పడవను తేల్చివేసే శక్తి కద్దు. కానీ ఎంతవరకు? పడవకు బొరియలు ఏర్పడనంతవరకు! దిగులుతో క్రుంగిపోవడం, ఆందోళనతో అలమటించడం, ఆరాటంతో కుమిలిపోవడం, స్వార్థచింతలతో తనను తాను సంకుచిత పరచు కోడం, కీర్తికి మురిసిపోవడంలాంటి అలతలతో, కలతలతో శరీరనౌక వికలం కాకుండా చూచుకుంటే చాలు, సునాయాసంగా జీవితసాగరాన్ని తరించవచ్చు."

ఆలోచిస్తూ కూర్చున్నాడు మూర్తి.